క్లుప్తంగా

దేశాభివృద్ధికి మావో మార్గమొక్కటే శరణ్యం



మావో చిత్రపటానికి జోహార్లు అర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

ఒంగోలు టౌన్: దేశం సుస్థిరాభివృద్ధి చెందాలంటే, పేద, గొప్ప తారతామ్యాలు లేని సమాజం కావాలంటే మావో మార్గంలో నడవటం తప్పదని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మావో 48వ వర్ధంతి సందర్భంగా నగరంలోని మాదాల నారాయణస్వామి భవనంలో విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా చిట్టిపాటి మాట్లాడుతూ వ్యవసాయక దేశమైన మన దేశంలో భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించి విప్లవాన్ని సాధించేందుకు ఉద్యమం కొనసాగుతోందన్నారు. వెనకబడిన దేశాలన్నింటికీ మావోయిజం ఆచరణీయమైన సిద్ధాంతంగా నిలిచిందన్నారు. చైనా శరవేగంగా అభివృద్ధి చెందడానికి మావోయిజమే కారణమన్నారు. పీడిత, తాడిత వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా చేతపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్, సుబ్బయ్య, మోజెస్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

కొత్తపట్నం: విజయవాడ వరద బాధితులకు మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం తాగునీరు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. దోమలతో ఇబ్బంది పడకుండా దోమల నివారణ కడ్డీలు అందించారు. ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డి.కేశవ, అతని సోదరుడు డాక్టర్ చెన్నకేశవులు సహకారంతో వరద బాధితులకు సాయం చేశారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల బహూకరణ



విద్యార్థులకు క్రీడాదుస్తులు అందించిన శివరామ కృష్ణారెడ్డితో హెచ్‌ఎం ప్రభాకర్, ఉపాధ్యాయులు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సన్నపురెడ్డి శివరామకృష్ణారెడ్డి సోమవారం క్రీడా దుస్తులు బహూకరించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడానికి క్రీడా దుస్తులు లేకపోవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, పీడీ మాధవీలతలు శివరామకృష్ణారెడ్డిని సంప్రదించారు. ఆయన స్పందించి 20 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు బహూకరించినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు ఐటీఐ విద్యార్థులకు జాతీయ అప్రెంటీస్ మేళా

ఒంగోలు: ఐటీఐ ఉత్తీర్ణులైన బాలురకు ఈ నెల 11వ తేదీ ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఒంగోలు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం అసిస్టెంట్ అప్రెంటీస్ అడ్వైజర్ ఎంవీ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో జెమ్ గ్రానైట్స్-చీమకుర్తి, జాన్సన్ లిఫ్ట్స్ అండ్ ఎస్కలేటర్స్-విజయవాడ, ఎస్ఆర్‌సీ ఎకోటెక్స్ ప్రైవేటు లిమిటెడ్-నెల్లూరు, హైదరాబాద్-నిజా మ్యాన్ పవర్ సర్వీసెస్, చిత్తూరు-అమరరాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్, హైదరాబాద్-హెటిరో ఫార్మాస్యూటికల్స్, అద్దంకి-కల్లాం టెక్స్‌టైల్స్, ఒంగోలు-జయలక్ష్మి ఆటోమొబైల్స్, శ్రీనివాస పాలిమర్స్‌తో పాటు జిల్లాలోని ప్రముఖ కంపెనీల యాజమాన్యాలు, వారి ప్రతినిధులు హాజరై ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులను వారి సంస్థల్లో అప్రెంటీస్‌కు ఎంపిక చేసుకుంటారని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు శిక్షణాభృతి ఇస్తారని తెలిపారు. అప్రెంటీస్‌షిప్‌ఇండియా.ఓఆర్‌జీ అనే పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, నకలు కాపీలతో మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9703165456ను సంప్రదించాలని కోరారు.

25 మద్యం సీసాలు పట్టివేత




స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై శ్రీకాంత్

నాగులుప్పలపాడు (మద్దిపాడు): నాగులుప్పలపాడు శివారు ప్రాంతంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న శ్రీను అనే వ్యక్తిని స్థానిక ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో కలిసి సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద 25 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఎక్సైజ్ శాఖ వారికి అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతానని తెలిపారు.



సమతానగర్‌లో సెట్టింగ్





గడ్డలగుంట నెహ్రూ బొమ్మ సర్కిల్లో...



గంటాపాలెం పార్వతమ్మ గుడి వద్ద...



రాజీవ్‌నగర్లోని వినాయక మండపంలో నృత్య ప్రదర్శన



భీమరాజువీధిలో...



గాంధీరోడ్డులో...

జై జై వినాయకా..!

ఒంగోలు నగరంలో వినాయకచవితి నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నగరంలోని ప్రతి కాలనీలో రెండుమూడు గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. కొన్నిచోట్ల వీధికో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో అట్టహాసంగా సెట్టింగులతో కూడిన మండపాలు సిద్ధం చేశారు. వాటిలో ప్రతిష్ఠించిన భారీ గణేష్ ప్రతిమలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. మూడోరోజు కావడంతో కొన్ని కాలనీల్లోని వినాయక విగ్రహాలను కోలాహలంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. చిన్నా..పెద్దా పాల్గొని గులాములు చల్లుకుని నృత్యాలతో సందడి చేశారు. భక్తిశ్రద్ధలతో గణేషునికి వీడ్కోలు పలికారు.

- ఒంగోలు మెట్రో



గడ్డలగుంటలో...



దేవుడుచెరువు పార్కు వద్ద శాస్త్రీయ నృత్యం చేస్తున్న బాలికలు



దేవుడుచెరువు పార్కు వద్ద...



అన్నదానంలో పాల్గొన్న భక్తులు



సోనియాగాంధీకాలనీలో...



కొత్తడొంకలో వినాయకుని పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

ఇసుక రవాణా వాహనాలను రిజిస్టర్ చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఇసుక సరఫరాపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఇసుక రవాణా చేసే వాహనాలను వాటి యజమానులు రిజిస్టర్ చేసుకోవాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఉచిత ఇసుక విధానాన్ని క్రమబద్ధీకరించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఇసుక రవాణా వాహనాలను రిజిస్టర్ చేయడం తప్పనిసరని అన్నారు. స్థానిక ప్రకాశం భవనంలో సోమవారం జిల్లా ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో కొత్త మార్గదర్శకాల మేరకు పంపిణీ విధానం ఉంటుందన్నారు. పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో ఉచిత ఇసుక పంపిణీ చేయాలన్నారు. అందులో భాగంగా ఆన్‌లైన్ ద్వారా వాహనాల యజమానులు వారి వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇంతవరకు 70 వాహనాలను మాత్రమే రిజిస్టర్ చేశారన్నారు. రిజిస్టర్ అయిన వాహన యజమానులు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎంప్యానల్ చేసుకోవాలని సూచించారు. నూతన ఇసుక విధానం ద్వారా ప్రజలకు మేలు జరిగేలా ట్రాన్స్‌పోర్టర్లు సహకరించాలన్నారు. లారీ, టిప్పర్ల కెపాసిటీని బట్టి ధరలు నిర్ణయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ రవాణాకు తావులేకుండా చూడాలన్నారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక కోసం వాహనాలు ఎదురు చూడకుండా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న తర్వాత ట్యాగ్ చేసిన వాహన దారునికి టైం స్లాట్ మెసేజ్ వస్తుందన్నారు. ఇసుక రవాణాకు వాహనాల రవాణా చార్జీలు రాష్ట్రం మొత్తం ఒకే విధంగా ఉండేలా ప్రభుత్వం నిర్ధారిస్తుందన్నారు. సమావేశంలో మైనింగ్ డీడీ జగన్నాథరావు, ఇరిగేషన్ ఎస్ఈ మురళీకృష్ణ, మార్కాపురం మైనింగ్ ఏడీ విష్ణువర్దన్, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, లారీల యాజమానులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన గుజరాత్ బృందం



సార్వత్రిక సూత్రాల చక్రములను పరిశీలిస్తున్న గుజరాత్ బృందం, అధికారులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక అధ్యయనం, పరిశీలన చేయడానికి గుజరాత్ రాష్ట్రానికి చెందిన 20 మందితో కూడిన బృందం సోమవారం జిల్లాకు వచ్చింది. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆహ్వానించారు. డీపీఎం సుభాషిణి కార్యాలయంలో జిల్లాలో ప్రకృతి వ్యవసాయం లక్ష్యాలు, ప్రగతి కార్యక్రమాల గురించి బృందానికి వివరించారు. అనంతరం కొత్తపట్నం మండలం గవుళ్లపాలెం గ్రామంలో బలగాని బ్రహ్మయ్య ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్స్‌ను పరిశీలించారు. కొత్తపట్నంలో మల్లేశ్వరమ్మ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో సార్వత్రిక సూత్రాల చక్రములను సందర్శించారు. బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికలు, అగ్నిస్త్రం, చేప, బెల్లం ద్రావణంపై డెమో నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఏవో మోహన్‌రెడ్డి, జిల్లా, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం బీచ్‌లో 146 వినాయక విగ్రహాల నిమజ్జనం



ఒంగోలు సాయినగర్ నుంచి తెచ్చిన విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



భారీ వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొత్తపట్నం: వినాయకచవితిని పురస్కరించుకుని ప్రతిష్ఠించి పూజలు చేసిన గణపతి విగ్రహాలలో పలు విగ్రహాలను సోమవారం మూడోరోజు కొత్తపట్నం, మడనూరు బీచ్‌లలో నిమజ్జనం చేశారు. మూడు రోజుల పాటు పూజలు చేసి ఊరేగింపుగా బీచ్ ప్రాంతానికి చేరుకున్నారు. తీరంలో వినాయక విగ్రహాలకు పూజలు చేసి సముద్రంలో నిమజ్జనం చేశారు భారీ వినాయక విగ్రహాలను మత్స్యకారుల సహాయంతో తీరం నుంచి సముద్రంలోకి తీసుకెళ్లారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అలల మధ్య ఇసుక బస్తాలు వేసి జెండాలు కట్టారు. అక్కడి నుంచి లోపలికి ఎవరూ వెళ్లకుండా మెరైన్ పోలీసులు, మత్స్యకారులు కలిసి భక్తులను అదుపు చేశారు. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐ మేడా శ్రీనివాసరావు, ఎస్సై సుధాకర్, మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు పర్యవేక్షించారు.

లండన్ కాలేజీలో ఫీజు కడతానంటూ మోసం



వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: తన కుమార్తె లండన్‌లో చదువుకునేందుకు భారీ మొత్తంలో డబ్బు చెల్లించి మోసపోయానంటూ ఓ వ్యక్తి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తన గోడు వెల్లబోసుకున్నాడు. తాళ్లూరు మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామానికి చెందిన తుపాకుల వెంకటేశ్వర్లు కుమార్తె లక్ష్మీప్రసన్నను లండన్‌లో ఎంబీఏ చదివించాలనుకున్నారు. అదే గ్రామానికి చెందిన బంధువు మీసాల శివాజీ లండన్‌లో ఉద్యోగం చేస్తుంటాడు. అమ్మాయికి మంచి కాలేజీలో సీటు ఇప్పిస్తానని, లండన్‌లో ఎంబీఏ చదివితే భవిష్యత్తు బాగుంటుందని శివాజీ చెప్పడంతో నమ్మిన వెంకటేశ్వర్లు కాలేజీ ఫీజు కోసం విడతల వారీగా రూ.10 లక్షలు బ్యాంకు ద్వారా చెల్లించాడు. 2022లో లక్ష్మీప్రసన్న లండన్ వెళ్లింది. అక్కడకు వెళ్లిన ఆమెను రిసీవ్ చేసుకోడానికి శివాజీ రాలేదు. కనీసం కాలేజీ ఫీజు కట్టలేదు. దీంతో అనేక ఇబ్బందులు పడ్డారు. తెలిసిన వారి ద్వారా మరో కాలేజీలో ఫీజు కట్టి లక్ష్మీప్రసన్నను ఎంబీఏలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె లండన్లో చదువుకుంటోంది. అయితే, కాలేజీ ఫీజు పేరుతో వసూలు చేసిన డబ్బు ఇవ్వమని శివాజీ తండ్రి మీసాల కోటేశ్వరరావును అడిగితే రేపు, మాపు అని వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ నెల 7వ తేదీ డబ్బు అడిగేందుకు కోటేశ్వరరావు ఇంటికి వెళ్లగా, కుమారుడితో కలిసి బూతులు తిడుతూ రోకలిబండతో దాడి చేశారు. తమ వద్ద తీసుకున్న డబ్బు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు.

రూ.2.14 లక్షలు పలికిన వినాయకుని లడ్డూ



జంగంగుంట్లలో రూ.2.14 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

కంభం: మండలంలోని జంగంగుంట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయకుడి లడ్డూ వేలం పాటలో రూ.2.14 లక్షలు పలికింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మనుమాసు జ్యోతివీరారెడ్డి వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

విద్యార్థులు విరాళాల సేకరణ

పొదిలి: మల్లవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం సోమవారం విరాళాలు సేకరించారు. ఈ విరాళాలు మొత్తం రూ.10 వేలు ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డికి ఉపాధ్యాయులు పాశం సుధాకర్, రమణారెడ్డి, శ్రీనివాస్‌లు అందచేశారు. మేఘన, జ్యోతి, జెస్సి, హెప్సి, శివపార్వతి, హేమ, అక్షర, శివకృష్ణ, గౌతమ్, నరసింహ తదితరులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. పెద్ద మనసుతో విరాళాలు సేకరించిన విద్యార్థినులను ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడండి

- నగరపాలక సంస్థ కమిషనర్‌కు సీపీఎం, సీపీఐ నాయకుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: నగరంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలు భయం భయంగా రోడ్లపై తిరుగుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్, సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి కోరారు. ఆ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు కనిపిస్తున్నాయని తెలిపారు. పగలూ..రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారని చెప్పారు. మహిళలు, చిన్నపిల్లలు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని రోడ్లపై తిరగాల్సిన దుస్థితి ఉందన్నారు. ఇంటి ముందు పిల్లలను ఆడుకునేందుకు పంపించాలన్నా.. తలిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. వెంటనే కుక్కల బెడదను పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, నగరంలో దోమల వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. సీజన్ మారడంతో డెంగీ లాంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్టు కాలనీల్లో మురుగు నీరు పోయే ప్రధాన కాలువ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. స్మార్ట్ సిటీ కోసం నిధులు వచ్చేలా కృషి చేయాలని, మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు దామా శ్రీనివాసులు, సయ్యద్ సర్దార్, తంబి శ్రీనివాసులు, ప్రకాశరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఎం శ్రీ పాఠశాలల సమీక్ష

ఒంగోలు: పీఎం శ్రీ పథకం కింద జిల్లాలో ఎంపికైన 48 పాఠశాలలపై సమీక్షను మంగళవారం స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, సంబంధిత మండలాల ఎంఈవో-2లతో సమీక్ష ఉంటుందన్నారు. దీంతో పాటు 33 పాల్ ల్యాబ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కూడా సమీక్ష ఉంటుందన్నారు. పాఠశాలలకు మంజూరైన కెమిస్ట్రీ ల్యాబ్, ప్లే గ్రౌండు, స్కూల్ గ్రాంట్స్, పాల్ ల్యాబ్ ప్రగతిపై సమీక్ష జరుగుతుందని, హెచ్ఎంలు, ఎంఈవో-2లు తగిన సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.